సాక్షి మంచిర్యాల

గురువారం । 16 । మార్చి । 2023



ఏజెన్సీ వైద్యానికి కొత్త రూపు

ఏజెన్సీ వైద్యానికి ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా కొత్త రూపు తీసుకొస్తోంది. మారుమూల ప్రాంతాల్లోని గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించే దిశగా అడుగులువేస్తోంది. 8లో▸

ఆన్‌లైన్‌లో ఆరోగ్య వివరాలు

మందమర్రిరూరల్: సింగరేణి ఉద్యోగులు, కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఏరియా జీఎం కార్యాలయ ఆవరణలో ఆయన మాట్లాడారు. డీజీఎం(ఐటీ) హరిశంకర్, డిప్యూటీ మేనేజర్ నాగదీప మాట్లాడుతూ వివరాల నమోదుతో ఆరోగ్య పరిస్థితి, చికిత్స వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. బెల్లంపల్లి జీఎం(సేఫ్టీ) జాన్‌ఆనంద్, డిప్యూటీ సీఎంఓ ఉషా, డిప్యూటీ మేనేజర్(ఐటీ) రవి, సీనియర్ పీఓ మైత్రేయబంధు పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 35.0 /23.0

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. తూర్పు దిశగా గాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

వరిపొలంలో క్రికెట్ ఆడుతూ నిరసన



క్రికెట్ ఆడుతున్న రైతు, కుటుంబీకులు

లక్సెట్టిపేట: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన రైతు కారుకూరి మల్లయ్య మూడెకరాల్లో వరి సాగు చేయగా నీరందక ఎండిపోతోంది. దీంతో తన కుటుంబీకులతో కలిసి పొలంలో క్రికెట్ ఆడుతూ బుధవారం నిరసన వ్యక్తం చేశాడు. గూడెం ఎత్తిపోతల ద్వారా పంట సాగు అవుతుందని భావించానని, పెట్టుబడులు పెడితే నీరందక పొలం ఎండిపోతోందని ఆవేదన వ్యక్తం చేశాడు. కాలువ నీరు రాకపోవడంతో తీవ్రంగా నష్టపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశాడు.

పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాలలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎంవీఎన్ కళాశాల నుంచి ఐబీ చౌరస్తా వరకు ప్లకార్డులతో సాగింది. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ పేపర్‌లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మండల కార్యదర్శి అభినవ్, నాయకుడు రాకేష్ పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

పాతమంచిర్యాల: ప్రశ్నపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఏవీ గుణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో బీఎస్పీ జోనల్ మహిళా కన్వీనర్ భవానీ, జిల్లా మహిళా కన్వీనర్ బొడ్డు వినోద, జిల్లా కార్యదర్శి కనకం విజయ్, లావణ్య, రాజకుమారి, చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సారయ్య పాల్గొన్నారు.

గిరిజనుల ఆందోళన



ఆందోళనలో పాల్గొన్న గిరిజనులు

లక్సెట్టిపేట: స్థానిక అటవీ కార్యాలయంలో ఎదుట గిరిజనులు బుధవారం ఆందోళన నిర్వహించారు. ర్యాలీగఢ్‌పూర్ ఫారెస్టు పరిధిలో చిన్నగోపాల్‌పూర్ గ్రామానికి చెందిన మధుకర్, రాజు, శంకర్ మంగళవారం రెండు చెట్లు నరకడంతో మధుకర్‌ను అదుపులోకి తీసుకోగా, ఇద్దరు పరారీలో ఉన్నట్లు స్థానిక రేంజి అధికారి స్వామి తెలిపారు. దీనికి నిరసనగా జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య ఆధ్వర్యంలో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కులవృత్తి చేసుకునే డోలు కోసం గిరిజనులు చెట్టుముక్కను తెచ్చుకుంటే కేసులు నమోదు చేస్తారా అని ప్రశ్నించారు. దీంతో ఎఫ్ఆర్వో, జెడ్పీటీసీ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య కార్యాలయానికి వచ్చి గిరిజనులతో మాట్లాడి శాంతింపజేశారు. దీనిపై ఎఫ్ఆర్వోను సంప్రదించగా, చెట్లు నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న క్రీడా డైరెక్టర్ వీకే సింగ్

కోటపల్లి: కేంద్రీయ మెట్ట పరిశోధన సంస్థ రైతులకు అందించే సేవలు సద్వినియోగం చేసుకోవాలని పరిశోధన సంస్థ డైరెక్టర్ వీకే సింగ్ అన్నారు. బుధవారం మండలంలోని మల్లంపేట గ్రామంలో ఎస్సీ రైతులకు కేంద్రీయ మెట్ట పరిశోధన సంస్థ అందజేసిన పెరటి కూరగాయల తోటలు, పొలంలోని పెసర పంటలను పరిశీలించారు. ఏ నెలలో ఎలాంటి పంటలు వేయాలి, పంట అధిక దిగుబడులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కొండంపేట, ఆలుగామ గ్రామాల్లో నీటి కుంటలు, చేపల చెరువులను సందర్శించారు. అనంతరం కొల్లూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సీ రైతులకు చిరుధాన్యాలు అందజేసి ప్రయోజనాలను వివరించారు. ఎస్సీ రైతులు చిరుధాన్యాలు, మిల్లెట్స్‌తో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. సంస్థ నోడల్ అధికారి డాక్టర్ టి.వి.ప్రసాద్, డాక్టర్ కేఎస్ రెడ్డి, శ్రీదేవి, గోపాలకృష్ణ, డీఆర్ఏ అమరేందర్, శైలేష్, సర్పంచ్ రాజాగౌడ్ పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తితో అభివృద్ధి

- మాతాశిశు ఆస్పత్రి, రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు



లక్సెట్టిపేటలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, వేదికపై మంత్రి ఐకే రెడ్డి, కలెక్టర్ సంతోష్

చెన్నూర్: చెన్నూర్‌లో 50ఏళ్లలో జరగని అభివృద్ధి నాలుగేళ్లలో దశ దిశ మారిందని, ఉద్యమ స్ఫూర్తితో చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆ ఘనత సాధించాడని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. చెన్నూర్ మున్సిపాల్టీలో బుధవారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాల్లో రాష్ట్ర అటవీ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ సుమన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ విపక్షాల 50ఏళ్ల పాలనలో పట్టణానికి బస్సు డిపో రాలేదని, సుమన్ బస్సు డిపోను తీసుకొచ్చాడని అన్నారు. చెన్నూర్ 50 పడకల ఆస్పత్రిని మాతాశిశు ఆస్పత్రికిగా మార్చాలని కోరాడని, హైదరాబాద్ వెళ్లిన తర్వాత ఉత్తర్వులు జారీ చేస్తానని హామీనిచ్చారు. రూ.1600 కోట్లతో చెన్నూర్ ఎత్తిపోతల పథకాన్ని త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని తెలిపారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ సుమన్‌కు పట్టుదల ఎక్కువని, మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలతో పోటీ పడి చెన్నూర్‌ను అభివృద్ధి చేశారని అన్నారు. ప్రభుత్వ విప్ సుమన్ మాట్లాడుతూ పాలకుల విపక్షతో చెన్నూర్ వెనుకబడిందని, కేసీఆర్ ఆశీర్వాదంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో దేశపతి శ్రీనివాస్, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీ, కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు కలెక్టర్లు మధుసూదన్‌నాయక్, రాహుల్, డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగయ్య పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

లక్సెట్టిపేట: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ సివిల్ ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల కోసం కేసీఆర్ కిట్, నూతనంగా న్యూట్రీషన్ కిట్ అందజేయనున్నట్లు తెలిపారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాసగౌడ్, ఎంపీపీ అన్నం మంగ, నాయకులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న మంత్రులు, విప్

విద్యుత్ కోతలు లేని తెలంగాణగా తీర్చిదిద్దాం

భీమారం: గతంలో అంధకారంలో ఉండే గ్రామాల నుంచి నేడు విద్యుత్ కోతల రహిత తెలంగాణగా తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. రూ.80 లక్షలతో భీమారంలో జాతీయరహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి ఇటీవల ఛత్తీస్‌గఢ్ సీఎంను రాష్ట్రానికి రప్పించారని, అక్కడ పగలంతా కరెంట్ కోతలు ఉంటాయని తెలిసిందని అన్నారు. అలాంటి కాంగ్రెస్ పాలన ఎవరికి కావాలి అని ప్రశ్నించారు. జెడ్పీటీసీ తిరుమల, సర్పంచ్ గద్దె రాంరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రానికి రోల్‌మోడల్ చెన్నూర్

జైపూర్: చెన్నూర్ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే బాల్క సుమన్ రాష్ట్రానికి రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దాడని మంత్రి హరీశ్‌రావు అన్నారు. మండలంలో బుధవారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఇందారం వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి, ఇందారం–రామారావుపేట చెరువు కట్టపై బీటీ రోడ్డు, ఇందారంలో సుందరీకరణ, సెంట్రల్‌లైటింగ్ పనులు ప్రారంభించారు. జైపూర్‌లో పెగడపల్లి ఈదులాగుపై బ్రిడ్జి పనులు, కేజీబీవీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభించారు. అంతకుముందు మంత్రికి ఎమ్మెల్యేలు, రామగుండం సీపీ రెమా రాజేశ్వరి స్వాగతం పలికారు. ఎంపీపీ గోదారి రమాదేవి, జెడ్పీటీసీ మేడి సునిత, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు షురూ



మంచిర్యాల ప్రభుత్వ కళాశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

- ఉత్కంఠతో ఉరుకులు పరుగులు
- ఆలస్యంగా వచ్చి వెనుదిరిగిన విద్యార్థిని

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 24 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు ప్రథమ సంవత్సరం విద్యార్థులు 7,439 మంది విద్యార్థులకు 6,907 మంది హాజరయ్యారు. 532మంది గైర్హాజరయ్యారు. ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. జనరల్ విద్యార్థులు 6,145 మందికి గాను 5,724 మంది హాజరు కాగా 421మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,294 మందికి గాను 1,183 మంది పరీక్ష రాయగా 111 మంది హాజరు కాలేదు. నిమిషం నిబంధన అమలు నేపథ్యంలో విద్యార్థులు సమయానికి ముందే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. మరికొందరు చివరి నిమిషంలో పరీక్ష కేంద్రాల్లోకి ఉరుకులు పరుగులు పెట్టారు. తొలిరోజు పరీక్ష కేంద్రాలను గుర్తించడంలో విద్యార్థుల్లో కొంత మేర ఆందోళన కనిపించింది. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే లోపలికి అనుమతించారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులు వెంట తెచ్చుకున్న వాచ్‌లు, పౌచ్‌లు ఇతరత్రా వస్తువులను సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన డబ్బాలో వేశారు. జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు పలు పరీక్ష కేంద్రాల్లో డీఐఈవో శైలజ పర్యవేక్షించారు.



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఆలస్యంగా వచ్చి వెనుదిరిగి..

మంచిర్యాల అల్ఫోర్స్ సెంటర్‌లో 20 నిమిషాలు ఆలస్యంగా వచ్చిన ఓ విద్యార్థిని వెనుదిరిగింది. స్థానిక ఎస్ఆర్ఆర్ కళాశాలలో విద్యార్థిని అల్ఫోర్స్ కేంద్రంలో పరీక్షా రాయాల్సి ఉంది. నిర్ణీత సమయం కంటే 20 నిమిషాలు ఆలస్యంగా వచ్చింది. అప్పటికే సమయం గడిచిపోవడంతో చేసేదేమీ లేక వెనక్కి వెళ్లాల్సి వచ్చింది. ఇదే పరీక్ష కేంద్రంలో 9గంటలకు ఒక నిమిషం ముందే విద్యార్థిని శివలీల ప్రధాన రహదారిపై దిగి పరుగున గేట్‌లోపలికి చేరింది. పరీక్ష రాసే అవకాశం లభించడంతో ఊపిరి పీల్చుకుంది. అక్కడే ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు ఒక సెకన్ ఆలస్యమైతే ఎలా ఉండేదోనని చర్చించుకోవడం కనిపించింది. మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మిమ్స్ జూనియర్ కళాశాల విద్యార్థి విజయసాయి తన తల్లి ఆసరాతో పరీక్ష కేంద్రానికి వచ్చి పరీక్ష రాశాడు.

తండ్రి సాయంతో పరీక్ష కేంద్రానికి..

దండేపల్లి: మండలంలోని శ్రీరాములపల్లెకు చెందిన దివ్యాంగ విద్యార్థి జలికె మారుతి లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం తండ్రి తిరుపతి సాయంతో మోటార్‌సైకిల్‌పై దండేపల్లి జూనియర్ కాలేజీలోని పరీక్ష కేంద్రానికి చేరుకున్నాడు. అతను నడవలేడు కాబట్టి చంకన ఎత్తుకుని పరీక్ష హాలులో కూర్చొబెట్టి వెళ్లాడు.



కుమారుడిని ఎత్తుకుని వస్తున్న తండ్రి

ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాల్టీలో సుమారు వంద కోట్లకు పైగా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రులు హరీశ్‌రావు, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ బుధవారం ప్రారంభించారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. షెడ్యూల్ ప్రకారం మంత్రులు ఉదయం 11గంటలకు చెన్నూర్‌కు రావాల్సి ఉండగా ఒంటిగంటకు చేరుకున్నారు. చెన్నూర్‌లోని పద్మనగర్‌కాలనీలో బీఆర్ఎస్ నాయకులు గజమాలతో స్వాగతం పలికారు. రూ.18కోట్లతో నాలుగు వరుసల రోడ్డు నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేసిన వానమామలై వరదాచర్యులు, తెలంగాణ తల్లి, మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించారు. రూ.21కోట్లతో వంద పడకల ఆస్పత్రి, రూ.4కోట్లతో బస్సు డిపోకు శంకుస్థాపన చేశారు. రూ.2.65 కోట్లతో నిర్మించిన మినీ స్టేడియం ప్రారంభం, రూ.1.70 కోట్లతో అదనపు పనులకు శంకుస్థాపన, రూ.3కోట్లతో నిర్మించిన కుమ్మరికుంట మినీ ట్యాంక్‌బండ్, రూ.1.50కోట్లతో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డు, రూ.2.50కోట్లతో నిర్మించిన కేసీఆర్ పార్కు, రూ.6కోట్లతో నిర్మించిన పెద్దచెరువు మినీ ట్యాంక్ బండ్ ప్రారంభించారు. రూ.1.50కోట్లతో సమ్మక్క, సారలమ్మ భవనానికి శంకుస్థాపన చేశారు. గాంధీనగర్‌లో 50పడకల ఆస్పత్రి భవన నిర్మా ణం పనులు సందర్శించి రూ.2.97కోట్లతో అదనపు పనులకు శంకుస్థాపన, రూ.4కోట్లతో గ్రామ పంచా యతీల్లో గ్రంథాలయ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, దేశపతి శ్రీనివాస్, కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్, డీఎంహెచ్ఓ సుబ్బరాయుడు, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ప్రవీణ్, మాజీ ఎమ్మెల్యే ఓదెలు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు కెంగర్ల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



చెన్నూర్‌లో వానమామలై విగ్రహావిష్కరణ

గుబులు పుట్టిస్తున్న మేఘాలు

- ఈదురు గాలులతో నేలరాలుతున్న మామిడి
- దిగుబడి దశలో మిరుప, నిల్వ ఉన్న పత్తి
- ఆందోళన చెందుతున్న రైతులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉపరితల ద్రోణి కారణంగా గత రెండ్రోజులుగా జిల్లాలో మేఘాలు గుబులు పుట్టిస్తున్నాయి. పెనుగాలులు వీస్తుండడంతో మామిడి కాత నేల రాలుతోంది. బుధవారం ఈదురుగాలులతోపాటు అక్కడక్కడ తేలికపాటి వర్షం కురిసింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికందే సమయంలో అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధర పెరుగుతుందనే ఆశతో రైతులు ఇళ్లలో భారీగా పత్తి నిల్వ ఉంచారు. దీంతోపాటు దిగుబడి దశకు చేరుకుంటున్న మిర్చి పంటకు భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఈ నెల 19వరకు రాష్ట్రంలో వడగండ్లు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. గత వానాకాలంలో పంటలు ఎదిగే దశ, దిగుబడి సమయంలో ఎడతెరిపి లేని భారీ వర్షాలతో రైతులు పంటలు నష్టపోయారు. ప్రస్తుతం యాసంగి వరి పంట పొట్ట దశకు చేరుకోగా మామిడి, మొక్కజొన్న, జొన్న, మిర్చి, కూరగాయల పంటలు దిగుబడి వస్తున్నాయి. ఈ సమయంలో భారీ వర్షాలు కురిస్తే పంట నష్టం తప్పదని రైతులు వాపోతున్నారు.

జిల్లాకు వర్ష సూచన

ఉపరితల ద్రోణి ఝార్ఖండ్ నుంచి ఛత్తీస్‌గఢ్ మీదుగా తెలంగాణకు సగటు సముద్ర మట్టం నుంచి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోందని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ ఎం.రాజేశ్వర్ నాయక్ తెలిపారు. హైదరాబాద్ వాతావరణ కేంద్రం నుంచి అందిన సమాచారం మేరకు మంచిర్యాల, కుమురంభీం జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు, తేలికపాటి నుంచి మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. 16, 17, 18వ తేదీల్లో వర్షం ఎక్కువగా పడనుందని, రైతులు పంటలపై ఎటువంటి రసాయన మందులు పిచికారీ చేయరాదని తెలిపారు. వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాల కోసం కేవీకే వాతావరణ శాస్త్రవేత్త సతీష్‌కుమార్‌ను 8309357311 నంబరులో సంప్రదించాలని కోరారు.



నెన్నెలలో నేలరాలిన మామిడి కాయలు

ప్రభుత్వం గిడ్డంగులు నిర్మించాలి



మాట్లాడుతున్న బాలరాజు

లక్సెట్టిపేట/పాతమంచిర్యాల: పౌరసరఫరాల కోసం ప్రభుత్వం సొంత గిడ్డంగులు నిర్మించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు అన్నారు. బుధవారం ఆయన లక్సెట్టిపేటలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో నిర్వహించిన సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల సమావేశంలో, మంచిర్యాలలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నిత్యావసర సరుకులు ఉంచేందుకు కొన్ని ప్రాంతాల్లో గిడ్డంగులు సరిపోవడం లేదని తెలిపారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలు, సంస్థల అమ్మకాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సింగరేణి ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించాలని కార్మికులను కోరారు. ఈ సమావేశాల్లో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్, మిట్టపల్లి పౌలు, నర్సింగరావు, సత్యనారాయణ, సంపత్, రాయమల్లు, మేదరి దేవవరం, రమణారెడ్డి పాల్గొన్నారు.

విఠల్‌ను మరిచారు.. 'పురాణం' పేరెక్కించారు..!

జైపూర్: జిల్లా అధికార యంత్రాంగం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్‌ను విస్మరించారు. అభివృద్ధి పనుల శిలాఫలకాలపై మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ పేరును రాయించడం చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్సీగా విఠల్ ఏడాది క్రితం ఎన్నికయ్యారు. మండల వ్యాప్తంగా మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా బుధవారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. ఇందారం రాజీవ్ రహదారిపై నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకంలో ఎమ్మెల్సీ విఠల్‌కు బదులుగా మాజీ ఎమ్మెల్సీ పేరు రాయించారు. ఇందారం సెంట్రల్ లైటింగ్, సుందరీకరణ పనుల ప్రారంభ శిలాఫలకంపై కూడా మాజీ ఎమ్మెల్సీ పేరు రాయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పురాణం సతీష్ పదవీ కాలం ముగిసినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చర్చించుకోవడం కనిపించింది.

ప్రభుత్వ భూమిలోనే వెంచర్..?

- బోర్డు తీసేసి ప్రహరీ నిర్మాణం
- పట్టించుకోని అధికారులు

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాల్టీలో ప్రభుత్వ భూమిలోనే వెంచర్ వెలుస్తున్నా అధికారుల పట్టింపు కరువైంది. ప్రభుత్వ భూమి అనే బోర్డు తొలగించి ప్రహరీ నిర్మించడం చర్చనీయాంశమైంది. మున్సిపాల్టీ పరిధిలో 1/70 యాక్టు అమలులో ఉన్నా రియల్ దందా ఆగడం లేదు. కొందరు ఎస్టీల భూములను కొనుగోలు చేసి దందా సాగిస్తుండగా, మరికొందరు ప్రభుత్వ భూమిలోనే వెంచర్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. టౌణంలోని ఊరుమందమర్రి వైపు వెళ్లే మార్గంలో ఊరచెరువును ఆనుకుని ఉన్న సర్వే నంబరు 100లో గతంలో ఒకరు వెంచర్ చేయగా గత ఏడాది ఆగస్టులో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ భూమి అనే బోర్డు ఏర్పాటు చేశారు. ఆ సర్వే నంబరు 9.30ఎకరాల భూమి ఉండగా ఎనిమిది ఎకరాల ఏడు గుంటల పట్టా భూమి, ఎకరం 23గుంటల ప్రభుత్వ భూమి ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ భూమి ఎక్కడ ఉందనే విషయం తేలకుండానే అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును తొలగించి ప్రహరీ నిర్మించినా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయమై తహసీల్దార్ సంపతి శ్రీనివాస్‌ను సంప్రదించగా.. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల ఆధ్వర్యంలో సర్వే చేసి ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.



చెరువును ఆనుకుని నిర్మించిన ప్రహరీ

నిర్మాణాలకు అనుమతి లేదు

ఊరు మందమర్రికి వెళ్లే మార్గంలో చెరువును ఆనుకుని కొందరు వెంచర్ ఏర్పాటు చేశారని గుర్తించి నోటీసులు జారీ చేశాం. వెంచర్‌కు ఎలాంటి అనుమతి లేనందున ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి నిర్మాణాల కోసం అనుమతి ఇవ్వబడదు. పట్టణ ప్రజలు గమనించి నిర్మాణాలకు అనుమతి లభించే స్థలాన్ని కొనుగోలు చేసుకోవాలి.

– గద్దె రాజు, మున్సిపల్ కమిషనర్, మందమర్రి

బీజేపీ, బీజేవైఎం నాయకుల అరెస్టు

మంచిర్యాలటౌన్/లక్సెట్టిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/వేమనపల్లి/మందమర్రిరూరల్/జైపూర్: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు బుధవారం జిల్లా పర్యటన నేపథ్యంలో జిల్లాలోని పలు మండలాల్లో బీజేపీ, బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతే మంత్రి జిల్లాలో పర్యటించాలని, లేనిపక్షంలో అడ్డుకుంటామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంచిర్యాలలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి తులా ఆంజనేయులు మాట్లాడుతూ హరీశ్‌రావు అసెంబ్లీలో ప్రకటించినట్లుగా గూడెం ఎత్తిపోతల పథకంలో వేసిన నాసిరకం పైపులైన్లను మార్చి కొత్త పైపులైన్ వేసి రైతుల పంటలకు నీరందించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో చెన్నూరు నియోజకవర్గంలో పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో బీజేపీ నాయకులు వెంకటేశ్వర్‌రావు, బోయిని హరికృష్ణ, అమిరిశెట్టి రాజు, అశోక్, మల్లేశ్, రాకేశ్, పచ్చ వెంకటేశ్వర్లు, శాస్త్రి రాజు ఉన్నారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

- లక్సెట్టిపేటలో వైఎస్సార్టీపీ, బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, న్యూడెమొక్రసీ నాయకులను అరెస్టు చేశారు. బీజేపీ నాయకుడు తమ్మినీడ శ్రీనివాస్‌ను హౌస్ అరెస్టులో ఉంచారు.
- హాజీపూర్ మండల బీజేపీ అధ్యక్షుడు బొలిశెట్టి తిరుపతి, పార్టీ నాయకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వేమనపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు బైస మల్లేష్, ఉపాధ్యక్షుడు ఏట మధుకర్, నాయకులు గణపురం సంతోష్, వెంకటేష్ అరెస్టు చేసి మధ్యాహ్నం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. మందమర్రిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు సప్పిడి నరేష్, మండల అధ్యక్షుడు పైడిమల్ల నర్సింగ్, నాయకులు దీక్షితులు, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, వెంకటాచారిలను అరెస్టు చేశారు.
- జైపూర్ మండల బీజేపీ అధ్యక్షుడు చల్ల విశ్వంభర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిరణ్‌గౌడ్, ఓబీసీ జిల్లా ప్రధానకార్యదర్శి డేగ నగేశ్, మండల ఉపాధ్యక్షులు బల్ల వెంకటేష్, పోచన్న, సాయినాథ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.



మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో నాయకులు

క్లుప్తంగా

మంత్రాల నెపంతో వృద్ధ దంపతులపై దాడి

భీమిని(బెల్లంపల్లి): మంత్రాల నెపంతో వృద్ధ దంపతులపై దాడి చేసిన సంఘటన మండలంలోని మల్లిడిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పత్తిపాక పెంటయ్య, పుష్పలత దంపతులు దుబ్బగూడెం గ్రామానికి చెందిన ఆకుల వెంకటేశ్ భార్య పద్మకు మంత్రాలు చేస్తూ అనారోగ్యం పాలు చేస్తున్నారనే నెపంతో బుధవారం ఆకుల సత్తయ్య, ఆకుల దుర్గయ్య, ఆకుల శ్రీను, ఆకుల రాజేశ్ కర్రలతో దాడికి పాల్పడ్డారు. పెంటయ్య కుమారుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఓసీలో కార్మికులకు పనిభారం తగ్గించాలి

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ ఓపెన్‌కాస్ట్ గనిలో కార్మికులకు ఇటీవల పనిభారం ఎక్కువైందని, ఒక్కో కార్మికుడికి నాలుగు రకాల పనులు అప్పగిస్తున్నారని, పనిభారం తగ్గించాలని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి అక్బర్‌అలీ అన్నారు. ఓసీలో బుధవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఓసీలో రక్షణాధికారి కార్మికులను వేధిస్తున్నారని, కాంట్రాక్ట్ కార్మికులకు సరైన రక్షణ పరికరాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఓసీలో కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్యను పెంచాల్సిన అవసరముందని అన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేయాలని తెలిపారు. నాయకులు ఇప్పకాయల లింగయ్య, ఆంజనేయులు, సతీష్, రామకృష్ణ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

తిర్యాణి(ఆసిఫాబాద్): తిర్యాణి మండలం మొర్రిగూడ పరిధిలో బుధవారం అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మొర్రిగూడ సమీపంలో బుధవారం గస్తీ నిర్వహిస్తుండగా తిర్యాణి నుంచి త్రీఇంక్లైన్ వైపు వెళ్తున్న టాటా ఇండిగో కారును అటవీశాఖ అధికారులు అనుమానంతో ఆపారు. కారు డ్రైవర్ వాహనాన్ని రోడ్డు పక్కకు నిలిపి దిగి పారిపోయాడు. కారులో తనిఖీ చేయగా అధికారులకు 15 టేకు దుంగలు లభించాయి. పట్టుకున్న కలప విలువ రూ.63 వేలు ఉంటుందని ఎఫ్ఆర్వో తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. సెక్షన్ ఆఫీసర్ రవి, సిబ్బంది ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



నిందితులు, వాహనంతో పోలీసులు

బెజ్జూర్(సిర్పూర్): బెజ్జూర్ బస్టాండ్ ప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న 45 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్ తెలిపారు. ఎస్పీ సురేశ్‌కుమార్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపడుతున్నామన్నారు. బుధవారం తెల్లవారుజామున అక్రమంగా బియ్యం తరలిస్తున్న మినీ ఐచర్ వ్యాన్‌ను పట్టుకుని ఫారూఖ్ ఖాన్, ఎండీ నయీం, ఖాజా మొహినొద్దీన్‌తోపాటు మరో వ్యక్తిని అరెస్ట్ చేశామన్నారు. నిరుపేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిందితులతోపాటు వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సై సందీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ వైద్యానికి కొత్త రూపు



ఉట్నూర్: ఏజెన్సీ వైద్యానికి ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా కొత్తరూపు తీసుకువస్తోంది. మారుమూల ప్రాంతాల్లోని గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించే దిశగా అడుగులు వేస్తోంది. ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యాధునిక సౌకర్యాలు కల్పించేలా ముందుకు సాగుతోంది. ఏజెన్సీ వ్యాప్తంగా 31 పీహెచ్‌సీలున్నాయి. వీటిలో సౌకర్యాల కల్పన ఆధారంగా జననీ నిరీక్షణ, బాలింత సంరక్షణ కేంద్రాలు, డయాగ్నోస్టిక్ హబ్ తదితర సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇప్పటికే ఉట్నూర్ కేంద్రంగా ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకలతో జిల్లా ఆసుపత్రిగా మార్చింది. అంతేకాకుండా డయాలసిస్, ఐసీయూ, రక్తనిధి కేంద్రాలను ఏర్పాటు చేసి గిరిపుత్రులకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చింది.



- గర్భిణులకు అండగా 'జననీ నిరీక్షణ'
- 'బాలింత సంరక్షణ'కు పెద్దపీట
- అందుబాటులోకి డయాగ్నోస్టిక్ హబ్
- 'ఎన్‌క్వాస్'తో మెరుగవుతున్న వైద్యసేవలు
- 'గిరి' ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలపై ఐటీడీఏ దృష్టి

బాలింత సంరక్షణ కేంద్రంగా కొనసాగుతున్న కెరమెరి పీహెచ్‌సీ

జననీ నిరీక్షణ కేంద్రాలు

ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాల్లో గర్భిణులు ప్రసవ సమయంలో ఇబ్బందులు పడుతుండేవారు. వర్షాకాలంలో సరైన రవాణా సౌకర్యం లేక సకాలంలో ఆసుపత్రికి చేరుకోలేక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం. ఈ ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం 2015లో జననీ నిరీక్షణ కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. తొలుత ఉట్నూర్, ఆసిఫాబాద్, జైనూర్ సీహెచ్‌సీలతో పాటు మంచిర్యాల ఏరియా ఆసుపత్రిలో వీటిని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇక్కడ సత్ఫలితాలు ఇవ్వడంతో కొత్తగా నార్నూర్, గాదిగూడ, ఝరి, గుడిహత్నూర్, ఇచ్చోడ, భీంపూర్, వాంకిడి, రోంపల్లి, గిన్నెధరి, కౌటాల, బెజ్జూర్ పీహెచ్‌సీల్లో ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని గర్భిణులను వారి ఆరోగ్యస్థితి మేరకు ప్రసవ సమయానికి మూడు నుంచి ఐదు రోజుల ముందే ఈ కేంద్రాలకు తరలిస్తారు. డెలివరీ సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వైద్య సేవలు అందిస్తారు.



జననీ నిరీక్షణ కేంద్రం ఏర్పాటుకు ఎంపికైన గాదిగూడ పీహెచ్‌సీ

బాలింత సంరక్షణ కేంద్రాలు..

ఏజెన్సీ ప్రాంతాల్లోని మహిళలు, బాలింతలు ఎక్కువగా రక్తహీనత, ఇతర సమస్యలతో బాధపడుతుంటారు. ఈ క్రమంలో వీరి మరణాలు తగ్గించేలా ఐటీడీఏ ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే కెరమెరి, వాంకిడి పీహెచ్‌సీల్లో అందుబాటులోకి తెచ్చింది. ఇవి సత్ఫలితాలు ఇవ్వడంతో ఇచ్చోడ, ఇంద్రవెల్లి, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్, గాదిగూడ, ఝరి, తిర్యాణి, సిర్పూర్–యు పీహెచ్‌సీల్లో వీటి ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. సర్కారు నుంచి ఆమోదం రాగానే ఏర్పాటు చేయనున్నారు. గర్భిణి ప్రసవం అనంతరం ఆరోగ్య స్థితి మేరకు ఈ సంరక్షణ కేంద్రంలో మెరుగైన వైద్య సేవలతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారం అందించనున్నారు.

సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలి



ఏజెన్సీలోని గిరిజనుల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆయా ప్రాంతాల్లోని పీహెచ్‌సీలకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తోంది. ఈ సౌకర్యాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలి.

– బాలు, ఏజెన్సీ అదనపు వైద్యాధికారి, ఉట్నూర్

గిరిజనం చెంతకు వైద్యం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 38 మండలాల్లో ఏజెన్సీ ప్రాంతాలు విస్తరించి ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో 4,95,794 మంది గిరిజనులు నివసిస్తుండగా వీరికి ఉట్నూర్, తిర్యాణి, ఆసిఫాబాద్, జైనూర్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రాలు, 31 పీహెచ్‌సీలు, 186 ఆరోగ్య ఉప కేంద్రాల ద్వారా ఐటీడీఏ వైద్య సేవలు అందిస్తోంది. అలాగే 23 మండలాల్లో 2014 నుంచి 18 అవ్వాల్ అంబులెన్స్‌ల ద్వారా సేవలందిస్తోంది. ఇప్పటికే 1589 మంది సికిల్‌సెల్, తలసేమియా వ్యాధులతో బాధపడుతున్నట్లు గుర్తించి సేవలు అందిస్తోంది. అంతేకాకుండా ఉట్నూర్ కేంద్రంగా డయాలసిస్, ఐసీయూ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. దోమ తెరలు పంపిణీ చేస్తూ కళాజాత బృందాల ద్వారా నిత్యం ఏజెన్సీ ప్రాంతాల్లో వ్యాధులపై అవగాహన కల్పించేలా ప్రదర్శనలు నిర్వహిస్తోంది.

వైద్య సిబ్బందికి వసతుల కల్పన

ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది స్థానికంగా నివాసం ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన పీహెచ్‌సీల్లో నివాస సముదాయాలు నిర్మిస్తోంది. ఇప్పటికే గాదిగూడ పీహెచ్‌సీలో ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేయగా పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. అలాగే ఇచ్చోడ, భీంపూర్–టి, ఝరి, ఇంద్రవెల్లి, కెరమెరి, తిర్యాణి, గిన్నెధరి, రోంపల్లి, లింగాపూర్, సిర్పూర్–యు, లోనువెల్లి పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బందికి నివాస సముదాయాలు నిర్మిస్తోంది. ఇందు కోసం రూ.6 కోట్లు విడుదల చేసింది.

'ఎన్‌క్వాస్' తో మెరుగు కానున్న సేవలు



ఎన్‌క్వాస్ గుర్తింపు పొందిన ఇంద్రవెల్లి పీహెచ్‌సీ

ఏటా జాతీయ వైద్య ఆరోగ్యశాఖ దేశ వ్యాప్తంగా మెరుగైన వైద్యసేవలు అందించే పీహెచ్‌సీలను గుర్తించి ఎన్‌క్వాస్ గుర్తింపు ఇస్తుంది. ఈ గుర్తింపు లభించిన పీహెచ్‌సీలకు మూడేళ్ల పాటు ఏటా జాతీయ వైద్య ఆరోగ్యశాఖ రూ.3 లక్షల చొప్పున అదనపు నిధులు అందిస్తోంది. ఇలా వచ్చే నిధులతో ఎంపికైన పీహెచ్‌సీల పరిధిలో వైద్య సేవలు మరింత మెరుగవనున్నాయి. ఈ ఏడాది ఉమ్మడి జిల్లా పరిధిలో బజార్‌హత్నూర్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి, దంతన్‌పల్లి, భీంపూర్–టి, గాదిగూడ, సిర్పూర్–యు, రోంపల్లి పీహెచ్‌సీలకు ఎన్‌క్వాస్ గుర్తింపు లభించింది. అలాగే అంకోలి పీహెచ్‌సీకి కూడా త్వరలోనే రానుంది.

ఏజెన్సీ కేంద్రంగా డయాగ్నోస్టిక్ హబ్..



ఏజెన్సీ కేంద్రంగా ఏర్పాటు కానున్న డయాగ్నోస్టిక్ హబ్

ఏజెన్సీవాసులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా ఉట్నూర్‌లో రూ.97 లక్షల వ్యయంతో డయాగ్నోస్టిక్ హబ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందులో 57 రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తారు. ఈమేరకు అవసరమైన చికిత్స అందజేస్తారు. మొదటి దశలో ఉట్నూర్ సబ్‌డివిజన్‌లోని శ్యాంపూర్, హస్నాపూర్, దంతన్‌పల్లి, ఇంద్రవెల్లి, పిట్టబొంగరం, నార్నూర్, గాదిగూడ, ఝరి పీహెచ్‌సీలను అనుసంధానం చేయనున్నారు. రానున్న రోజుల్లో మిగతా పీహెచ్‌సీలను అనుసంధానం చేస్తారు.

ఉద్యోగుల వివరాలు 'శాప్'లో నమోదు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో పనిచేస్తున్న ఉద్యోగుల ఆరోగ్య వివరాలను శాప్‌లో నమోదు చేస్తున్నట్లు డీజీఎం(ఐటీ) కార్పొరేట్ హరిశంకర్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఏరియాలోని అన్ని విభాగాల అధిపతులు, సంక్షేమ అధికారులు, క్లర్కులకు ఎస్‌హెచ్‌ఎంఎస్(సింగరేణి హాస్పిటల్ మేనేజ్‌మెంట్ సిస్టం)పై జీఎం దేవేందర్‌తో కలిసి అవగాహన కల్పించారు. అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తూ, సింగరేణిలో పనిచేస్తున్న ప్రతీ ఉద్యోగి ఆరోగ్య, హాజరు వివరాలను ఎప్పటికప్పుడూ శాప్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. ప్రతీ ఉద్యోగి ఫిట్, అన్‌ఫిట్ వివరాలు, మెడికల్ రిపోర్ట్‌లను ఆన్‌లైన్‌లో చూసుకునే విధంగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం గుప్తా, ఏజీఎం తిరుమల్‌రావు, డీవైసీఎంవో ఆర్ శౌరి, ఐటీ మేనేజర్ నారాయణ, సీనియర్ పీవో కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఐటీ డీజీఎం హరిశంకర్

ఫీజు చెల్లించడం లేదని చితకబాదారు!

- విద్యార్థిని కాలుపై వాతలు తేలేలా కొట్టిన వైనం
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



విద్యార్థిని కాలుపై వాతలు

చింతలమానెపల్లి(సిర్పూర్): ఫీజులు చెల్లించడం లేదని విద్యార్థులను చితకబాదిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్– 1లోని శ్రీనికేతన్ పాఠశాలలో 1వ తరగతి విద్యార్థినిని ఉపాధ్యాయుడు వసంత్ కొట్టినట్లు చిన్నారి తండ్రి సోషల్ మీడియాలో పెట్టడం చర్చనీయాంశంగా మారింది. లంబాడిహేటి గ్రామానికి చెందిన అక్కాచెల్లెల్లు ప్రీతి, శ్రుతిలు రవీంద్రనగర్‌లోని శ్రీనికేతన్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నారు. సుమారు నెల రోజుల క్రితం శ్రుతి ఫీజు చెల్లించడం లేదని చెవిపై తీవ్రంగా కొట్టడంతో రెండు రోజుల పాటు అస్వస్థతకు గురైంది. తల్లిదండ్రులు నిలదీయడంతో పొరపాటు జరిగిందని, పునరావృతం కాకుండా చూస్తామని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. మళ్లీ 11వ తేదీన ప్రీతిని సరిగా చదవడం లేదని కర్రతో కాలిపై తీవ్రంగా కొట్టాడు. దీంతో చిన్నారి తండ్రి విలాస్ పాఠశాలకు వెళ్లి సిబ్బందిని నిలదీశాడు. విద్యార్థి గాయపడిన ఘటనను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. పిల్లలను ఫీజులు చెల్లించడం లేదని ఇష్టం వచ్చినట్లు చితకబాదారని, పాఠశాల సిబ్బందిని అడిగితే దురుసుగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పోస్టులో పేర్కొన్నాడు. ఈ ఘటనపై శ్రీనికేతన్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. హోంవర్క్ చేయనందుకు మందలించి కొట్టినట్లు తెలిపాడు. 'అన్ని పాఠశాలల్లో కొడుతున్నారు. మేమూ కొడుతున్నాం' అని చెప్పడం గమనార్హం. కాగా గతంలో కూడా విద్యార్థులను కొడుతున్నారని పలుమార్లు తల్లిదండ్రులను పాఠశాలకు వచ్చి నిలదీసిన ఘటనలు ఉన్నాయి. ఇదే విషయంపై మండల విద్యాధికారి సోమయ్యను వివరణ కోరగా ఫీజుల కోసం విద్యార్థులను చితకబాదడం సరికాదని, ఈ విషయంపై పాఠశాలను విజిట్ చేసి విచారణ జరుపుతామని ఆయన వెల్లడించారు.

రోగులకు విరిగిన స్ట్రెచరే దిక్కు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు విరిగిన స్ట్రెచరే దిక్కవుతోంది. ఆస్పత్రిని ఆధునికంగా నిర్మించినా సౌకర్యాలు కల్పించకపోవడంతో రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఏరియా ఆస్పత్రిని కొన్ని నెలల క్రితం మంత్రులు హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి ప్రారంభించారు. సరిపడా వైద్యులు, సిబ్బందిని నియమించి సదుపాయాలు కల్పిస్తామని ప్రకటించి నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదు. చికిత్స కోసం ఆస్పత్రికి వస్తున్న రోగులు అవస్థలు పడుతున్నారు. బుధవారం భీమిని మండలం మల్లిడి గ్రామానికి చెందిన పత్తిపాక పెంటయ్యపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు ఆస్పత్రికి తీసుకు రాగా విరిగిన స్ట్రెచర్‌లో నలుగురు మోసుకెళ్లాల్సి వచ్చింది. ఆ తర్వాత పెంటయ్యను మంచిర్యాలకు రెఫర్ చేశారు.



వృద్ధుడిని స్ట్రెచర్‌పై మోసుకెళ్తున్న కుటుంబీకులు

'ఎన్నికల హామీలు నెరవేర్చాలి'

శ్రీరాంపూర్: టీబీజీకేఎస్, టీఆర్‌ఎస్ నేతలు ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని హెచ్‌ఎమ్మెస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం ఆర్కే 6 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కొత్తగనులు, మైనింగ్ యూనివర్సిటీని ఏర్పాటు చేయిస్తామని, మారు పేర్లతో పని చేసే వారి పేర్లను క్రమబద్ధీకరిస్తామని, ప్రైవేటీకరణ ఆపుతామని హామీనిచ్చి విస్మరించారని తెలిపారు. రిటైర్మెంట్ వయస్సు పెంచినా పెరిగిన ఏడాదికి సంబంధించిన పెన్షన్, గ్రాట్యూటీ, సీఎంపీఎఫ్ డబ్బులు చెల్లించడం లేదన్నారు. ఏఐటీయూసీ నేతలు టీబీజీకేఎస్‌తో చీకటి ఒప్పందం చేసుకొని కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. పలువురు కార్మికులు యూనియన్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎమ్మెస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు జీవన్‌జోయల్, కార్యదర్శి తిప్పారపు సారయ్య, కేంద్ర ఉపాధ్యక్షుడు వీ.అనిల్‌రెడ్డి, నాయకులు రాజేంద్రప్రసాద్, అశోక్, దుర్గం లక్ష్మణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

విద్యుత్ తీగలు అమర్చిన ఇద్దరి రిమాండ్


తాండూర్(బెల్లంపల్లి): విద్యుత్ తీగలు అమర్చిన ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తాండూర్ డెప్యూటీ రేంజ్ అధికారి తిరుపతి తెలిపారు. మండలంలోని కిష్టంపేటకు చెందిన చల్లూరి సంతోష్, నీలయపల్లె వాసి కోయపోశం నీలయపల్లె శివారు అటవీప్రాంతంలో వన్యప్రాణులను హతమార్చేందుకు విద్యుత్ తీగలు అమర్చారు. మాదారం ఫారెస్టు బీట్ అధికారి సఫియా బేగం నిందితులను అదుపులోకి తీసుకుని వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి బుధవారం కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి విచారణ చేసి సదరు నిందితులకు 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. ఈమేరకు నిందితులను ఆసిఫాబాద్ సబ్ జైలుకు తరలించినట్లు డెప్యూటీ రేంజ్ అధికారి పేర్కొన్నారు.



ఆసిఫాబాద్ జైలులో నిందితులు

ఎలక్ట్రిక్ సేఫ్టీపై వీడియో కాన్ఫరెన్స్

రెబ్బెన(ఆసిఫాబాద్): ఎలక్ట్రిక్ సేఫ్టీ అంశాలపై బుధవారం బెల్లంపల్లి ఏరియాలోని ఈఅండ్‌ఎం అధికారులకు ఎల్‌అండ్‌టీ కంపెనీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ పనులు చేస్తున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విధి నిర్వహణలో తప్పనిసరిగా గ్లౌజులు వంటి రక్షణ పరికరాలను ధరించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎం తిరుమల్‌రావు, ఏరియా వర్క్‌షాప్ డీజీఎం కృష్ణమూర్తి, డీవైఎస్ఈ రమేశ్, ఎస్.రాజు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న ఈఅండ్‌ఎం అధికారులు

విద్యుత్ మోటారు చోరీ

కౌటాల(సిర్పూర్): కౌటాల మండల కేంద్రంలోని మెగా పార్కులో మొక్కలకు నీరందించేందుకు బోరుకు బిగించిన విద్యుత్ మోటారు, స్టార్టర్‌ను మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ బుధవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎత్తుకెళ్లిన మోటారు, స్టార్టర్ విలువ రూ.30 వేలు ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన పేర్కొన్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ